
వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఎన్నికల నిబంధనలను అమలు చేయాలి

» రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని


కామారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌ను ఎన్నికల నియమ నిబంధనలు, నియమావళిని పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వివరించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడు తూ 2వ సాధారణ పంచాయతీ ఎన్నిక లు-2025 నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియ ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల చివరి విడత నామినేషన్ల ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. 3వ విడతలో నిర్వహించే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రకటన, ఫారాలు జారీ చేయాలని, ఉప సర్పంచ్ ఎన్నిక పరోక్షంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, ఫారం 14, 20 వినియోగంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ లో నెలకొన్న సమస్యలు, అందిన ఫిర్యాదుల పరిష్కారంపై (మిగతా 8లో..)

పీజీ సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

» ఎల్ఎల్‌బీ, పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయాలి
» మిగిలిన సీట్లను విద్యార్థులకు కేటాయించకపోవడం దారుణం
» పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్

7

జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం గురువారం నుంచి ప్రారంభమైంది. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ బుధవారం ముగిసింది. దీంతో పోటీలో నిలబడే అభ్యర్థుల జాబితా వెలువడింది. ఈ అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను అధికారులు కేటాయించారు. దీంతో వారు ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రచారంలో వారికి కేటాయించిన గుర్తులను ప్రదర్శిస్తూ ఓటర్లకు గుర్తుండేలా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు.



మొదటి విడత ప్రచారం షురూ

» తేలిన మొదటి విడత అభ్యర్థుల లెక్క
» సర్పంచ్ స్థానాలకు 733 మంది అభ్యర్థులు
» వార్డు స్థానాలకు 3,240 మంది బరిలో ఉన్న అభ్యర్థులు
» ఎన్నికల అధికారులు కేటాయించిన గుర్తులతో అభ్యర్థుల ప్రచారం
» ఇప్పటికే కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, బ్యానర్లతో సందడే సందడి
» పల్లెల్లో హోరెత్తనున్న ప్రచారం


కామారెడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ లో భాగంగా మొదటి విడత బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. నామినేషన్ల ఉప సంహరణతో ఎంత మంది బరిలో ఉన్నారని అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు గురువారం ప్రకటించారు. మొదటి విడతలోని ఆయా గ్రామ పంచాయతీ వార్డు స్థానాలకు పలువురు ఆశావహులు తమ నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో రిటర్నింగ్ అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించిన ప్రధాన పార్టీల మద్దతుదారులు ఇక పల్లెల్లో ప్రచార సందడి నెలకొంది.

పోటీలో మిగిలిన అభ్యర్థులు

మొదటి విడతలో కామారెడ్డి డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో 167 సర్పంచు, 1,520 వార్డు స్థానాలకు డిసెంబరు 11న ఎన్నికలు జరగనున్నాయి. 167 పంచాయతీల్లో 11 జీపీలు ఏకగ్రీవమయ్యా యి. 1,223 మంది నామినేషన్లు వేయగా 491 మంది నామినేషన్లను ఉప సంహరించుకున్నారు. దీంతో 156 సర్పంచు స్థానాలకు 733 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇక 1,520 వార్డు స్థానాలకు గాను 433 వార్డులు ఏకగ్రీవమయ్యా యి. మరో మూడు వార్డుల్లో సింగిల్ నామినేషన్లు వచ్చిన వారు కూడా ఉప సంహరించుకున్నారు. దీంతో ఆ మూడు వార్డుల్లో ఎన్నికలు వాయిదా పడనున్నాయి. మిగిలిన 1,084 వార్డు స్థానాలకు 592 మంది నామినేషన్లను విత్‌డ్రా చేసుకోగా 3,240 మంది అభ్యర్థులు (మిగతా 8లో..)

మొదటి విడత బరిలో నిలిచిన అభ్యర్థులు

మండలం	సర్పంచ్ స్థానాలు	పోటీలో ఉన్నవారు	ఏకగ్రీవాలు	వార్డు స్థానాలు	పోటీలో ఉన్నవారు	ఏకగ్రీవాలు
భిక్కనూరు	18	80	0	154	490	28
బీబీపేట్	10	51	1	84	265	24
దోమకొండ	09	47	0	82	250	14
కామారెడ్డి	14	67	0	107	303	13
మాచారెడ్డి	21	101	4	102	394	94
పాల్వంచ	11	59	1	89	286	21
రాజంపేట్	16	78	2	100	269	58
రామారెడ్డి	18	85	0	125	381	38
సదాశివనగర్	21	82	3	214	328	86
తాడ్వాయి	18	74	0	111	274	57
మొత్తం	156	733	11	1084	3240	433




మాట్లాడుతున్న డీఈవో రాజు

కామారెడ్డిలో.. వేస్ట్ టు వెల్త్ ఎగ్జిబిషన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మన రోజువారి జీవితంలో ఉత్పత్తి అయ్యే చెత్తను సక్రమంగా వర్గీకరించి పునర్వినియోగం చేస్తే అది సంపదగా మారుతుందని డీఈవో రాజు అన్నారు. గురువారం వేస్ట్ టూ వెల్త్ ఎగ్జిబీషన్‌ను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో రాజు మాట్లాడుతూ ప్లాస్టిక్, కాగితం, లోహం వంటి పొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపడం ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. వంటింటిలోని తడి చెత్తను కంపోస్టుగా మార్చి వ్యవసాయం, తోటల్లో ఉపయోగిస్తున్నారని అన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు పాత బాటిల్స్‌తో పెన్ స్టాండ్లు, డబ్బాలతో ప్లాంట్ పాట్లులు, పేపర్‌తో ఆర్ట్ మోడల్స్ తయారు చేసి ప్రదర్శనలు నిర్వహించడం అభినందించదగిన విషయమని అన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆదాయం అందించే ఈ 'వేస్ట్ టు వెల్త్' చర్యకు ప్రతీ ఇంట్లో, ప్రతీ స్కూల్లో, ప్రతీ గ్రామంలోని ప్రజలు పాలుపంచుకుంటే పర్యావరణాన్ని రక్షించిన వారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరామిరెడ్డి, జిల్లా ఎన్జీసీ కో ఆర్డినేటర్ విద్యాసాగర్, ఐటీ హబ్ శ్రీకాంత్, సైన్స్ ప్రతినిధులు కృష్ణారావు, సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


దేవునిపల్లి దత్తాత్రేయ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా దత్త జయంతి

కామారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆయా ఆలయాల్లో దత్త జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దేవునిపల్లిలోని దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలంతా కలిసికట్టుగా ఉండి ఆలయాల అబివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలుగా ఉంటాయని అన్నారు. అదేవిధంగా విద్యానగర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుకలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. ఆయా ఆలయాల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో రాజు పాటిల్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రవి యాదవ్, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట ఎంపీడీవో, ఎంపీవోలపై సస్పెన్షన్ వేటు

» ఎన్నికల నిర్వహణను నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై చర్యలు
» చర్చ నీయాంశంగా మారిన అధికారుల సస్పెన్షన్

నాగిరెడ్డిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంగా నాగిరెడ్డిపేట ఎంపీడీవో లలిత కుమారిని, ఎంపీవో ప్రభాకర్‌చారీలను సస్పెన్షన్ చేస్తూ బుధవారం రాత్రి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశీష్‌సాంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు గత నెల నవంబరు 30 నుంచి ఈనెల 2వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించారు. ఎన్నికల్లో నామినేషన్‌లు వేసిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల వివరాలను జిల్లా అధికారులకు అందించిన నివేదికలో వ్యత్యాసం వచ్చింది. దీంతో నామినేషన్ల సరైన వివరాల కోసం జిల్లా అధికారులు ఎంపీడీవో, ఎంపీవోలను ఫోన్ ద్వారా సంప్రదించే ప్రయత్నం చేయగా వారు అందుబాటులో లేకపోయారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్ మంగళవారం రాత్రి నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో స్థానిక ఎంపీడీవో, ఎంపీవో ఇద్దరూ కార్యాలయంలో లేకపోవడం, స్థానికంగా వారు అందుబాటులో లేకపోవడంతో డీఎల్పీవో సురేందర్ ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో నామినేషన్ పత్రాలను పరిశీలించి వాటిని సరిచేసి నామినేషన్ పత్రాల్లో ఉన్న వ్యత్యాసాన్ని సరి చేసి జిల్లా అధికారులకు సరైన నివేదికను సమర్పించారు. స్థానిక ఎన్నికల సమయంలో స్థానికంగా ఉండకపోవడంతో పాటు ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసి విచారణ జరిపారు. అనంతరం కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యంలో మండలానికి చెందిన ఇద్దరు అధికారులు ఎంపీడీవో, మండల పంచాయతీ అధికారి (ఎంపీవో)లను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల వేళ మండలానికి చెందిన ఇద్దరు అధికారులు సస్పెన్షన్ వేటుకు గురి కావడం మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

చిత్తడి నేలలను గుర్తించాలి

• కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న చిత్తడి నేలలను గుర్తించాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్, డీఎఫ్‌వో నిఖిత అధికారులను ఆదేశించారు. గురువారం కామారెడ్డి కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న సహజ, కృత్రిమ చెరువులు, కుంటలు, జలాశయాలు మొదలైన ప్రాంతాలను చిత్తడి నేలలను ప్రమాణాల ప్రకారం గుర్తించాలన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, అటవీ, నీటి పారుదల, ఫిషరీస్ శాఖలు సమన్వయంతో స్థల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ చిత్తడి నేలలు సంబంధించిన సరిహద్దులు, ఎఫ్‌టీఎల్, భూమి రికార్డులు, జీవ వైవిధ్యం, నీటి ప్రవాహ మార్గాలు వంటి వివరాలను రూపొందించి జీఐఎస్ మ్యాపింగ్ చేయాలని అన్నారు. సర్వే వివరాల ఆధారంగా జిల్లా స్థాయిలో చిత్తడి నేలలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని అధికారులకు సూచించారు. చిత్తడి నేలలు ఉన్న ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలు, చెత్త పారవేయడం, కాలువల మూసివేత, సిల్టింగ్, వ్యర్థ జలాల ప్రవాహం మొదలైన కార్యకలాపాలను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించారు. అన్ని శాఖలు పారదర్శకంగా, సమయపాలనతో డేటా అందించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు విక్టర్, మదన్ మోహన్, ఎఫ్‌డీవో రామకృష్ణ, సునీత, ఎఫ్ఆర్‌వో రమేష్, హబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

కామారెడ్డి రూరల్: కలెక్టరేట్‌లో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను సాధారణ పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి, కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ గురువారం (మిగతా 8లో..)

పల్లె పోరు.. ప్రచార జోరు

» విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎన్నికల సామగ్రి
» సందడిగా మారిన ప్రింటింగ్ ప్రెస్‌లు, ఫ్లెక్సీ షాప్‌లు

6

రోడ్డెక్కిన కేజీబీవీ విద్యార్థినులు

» తిన్న ప్లేట్లతో భీమ్‌గల్‌లో నిరసన
» నీటి వసతి లేకపోవడంతో దుర్వాసన వస్తున్న బాత్‌రూంలు
» నీటి వసతి కల్పించాలని విద్యార్థినుల వినతి

6



మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ బి. శివధర్‌రెడ్డి

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

» ఎన్నికలకు పోలీసు శాఖ సిద్ధంగా ఉంది
» స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు
» డీజీపీ శివధర్‌రెడ్డి

కామారెడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతియుతంగా, పారదర్శకంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ బి. శివధర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ పోలీసు అధికారులతో ఎన్నికలపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఎన్నికల సమయం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని ఇందులో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించడం పోలీసుశాఖ బాధ్యత అన్నారు. జిల్లాలోని సున్నితమైన పోలింగ్ కేంద్రాల గ్రామాల వివరాలను డీజీపీ అడిగి తెలుసుకున్నారు. అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు తెలియజేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, విద్వేశపూర్వక పోస్టులు, ఎన్నికల ప్రక్రియను ప్రభవితం చేసే కార్యకలాపాలను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు కూడా అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లాలో 30 యాక్ట్ అమలులో ఉన్నందున ముందస్తు అనుమతులు తప్పని సరి అన్నారు. జిల్లాలో ఎన్నికల సందర్భంలో బైండోవర్ చేసిన ఐదుగురి ప్రవర్తన నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఓటింగ్ సమయంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసుకునేలా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతకు ముందు డీపీవో కార్యాలయానికి వచ్చిన డీజీపీకి ఎస్పీ, నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు.

గ్రామాల్లో త్రిముఖ పోరు

» సర్పంచ్ స్థానంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతల ఫోకస్
» గ్రామాల్లో పాగా వేసేందుకు ప్రధాన పార్టీల ప్రణాళికలు
» రసవత్తరంగా గ్రామ రాజకీయాలు
» సర్పంచ్ బరిలో భారీగా నిలుస్తున్న అభ్యర్థులు



కామారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో స్థానిక రాజకీయం రసవత్తరంగా మారింది. సర్పంచ్ పదవికి అభ్యర్థులు భారీగా పోటీ పడుతున్నారు. సర్పంచ్‌లతో పాటు ఉప సర్పంచ్ పదవిని ఆశించే వారి సంఖ్య పెరగడంతో వార్డుల్లో సైతం పోటీ తీవ్రతరమవుతోంది. అయితే ఈ సారి గ్రామాల్లో మూడు పార్టీల మధ్య పోటీ కనిపిస్తోంది. పల్లెలను 'హస్త'గతం చేసుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తుంటే.. పూర్వ వైభవం కోసం బీఆర్ఎస్ తాపత్రయపడుతోంది. ఇక రాష్ట్రంపై ఫోకస్ వేసిన బీజేపీ గ్రామాలపై పట్టు సాధించాలనే కసితో వ్యూహాలు రచిస్తోంది. ఎవరికి వారీగా మెజార్టీ గ్రామ పంచాయతీలను తమ ఖాతాల్లో వేసుకోవాలని చూస్తున్నారు. ఇక బరిలో నిలిచే అభ్యర్థులు పార్టీ బలంతో పాటు సొంత ఇమేజ్, ధన బలాన్ని సైతం ప్రయోగించేందుకు సిద్ధయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో ఎన్నెన్నో హామీలు గుప్పిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి ఎన్నికల ప్రచారం సాగుతుండడంతో ఓటర్లను విస్మయానికి గురి చేస్తోంది. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితమే అయినప్పటికీ మూడు ప్రధాన పార్టీలు స్పెషల్ ఫోకస్ చేశాయి. పల్లెల్లో పట్టును నిలుపుకొనేందుకు ఆయా పార్టీల జిల్లా అధ్యక్షులు సవాలుగా స్వీకరించి వ్యూహాలు రచిస్తున్నారు. ప్రస్తుతం రెండవ దశ నామినేషన్లు పూర్తయి మూడవ విడత నామినేషన్ల ఘట్టం కొనసాగుతోంది. దీంతో క్షేత్రస్థాయిలో ఏ వ్యూహంతో ప్రచారం చేస్తే ప్రజల మద్దతును కూడగట్టొచ్చనే విషయమై ఆయా పార్టీల మండలాధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమాలోచన చేస్తున్నారు. మండలాల వారీగా ముఖ్య నాయకులతో రహస్య మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. మొత్తంగా పల్లె రాజకీయాల్ని మూడు పార్టీలు ఈ సారి మరింత రసవత్తరంగా మారుస్తున్నాయి.

'హస్త'గతం కోసం ప్రయత్నాలు

పల్లెపోరులో కాంగ్రెస్ సత్తా చాటేందుకు ఉత్సాహం కనబరుస్తోంది. అధికార బలంతో మెజార్టీ పంచాయతీలను తన ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది. నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలతో నిత్యం సమీక్షిస్తున్నారు. జిల్లాలో ఎక్కువ మంది సర్పంచ్‌లు, వార్డు సభ్యులు గెలిపించుకోవాలనే పట్టుదలతో ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే వ్యూహాలకు పదును పెట్టి పంచాయతీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తోంది. మెజార్టీ సర్పంచ్ స్థానాలను తమ పార్టీ మద్దతుదారులను గెలిపించుకునేందుకు కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం ప్రకటించే స్కీంలే తమ విజయానికి దోహదపడతాయని అభ్యర్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ వైభవం కోసం బీఆర్ఎస్

గ్రామాల్లో బీఆర్ఎస్‌కు నేటికీ పట్టు ఉంది. ఆ బలంలో ఎక్కువ మంది (మిగతా 8లో..)


కుస్తీ పోటీల్లో పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో వెండి పతకం సాధించిన ఎల్లారెడ్డి విద్యార్థి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వెండి పతకం సాధించిన ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రమావత్ ఈశ్వర్‌ను గురువారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు ఈ నెల 1 నుంచి 3 వరకు జుక్కల్ మండల కేంద్రంలో నిర్వహించగా అండర్ 14 విభాగంలో తమ పాఠశాలకు చెందిన రమావత్ ఈశ్వర్ పాల్గొని మంచి ప్రతిభ చూపి వెండి పతకం సాధించాడని తెలిపారు. ఈ మేరకు విద్యార్థి ఈశ్వర్‌ను అభినందించారు. విద్యార్థిని ప్రోత్సహిస్తూ పతకం సాధించడానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు లాల్‌సింగ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

జింకను చంపిన వేటగాళ్లకు రిమాండ్

నిజామాబాద్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారం అడవుల్లో జింకను వేటాడి హతమార్చిన నలుగురికి రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. గురువారం రూరల్ సీఐ కార్యాలయంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి.. కేసు వివరాలు వెల్లడించారు. బోర్గాం గ్రామానికి చెందిన గందం విజయ్, దాసరి వెంకట, నిమ్మల భూమయ్య, అనీల్ వలవేసి జింకను బంధించి, దానిని చంపారన్నారు. వారి నుంచి ఇనుప సుత్తి, సత్తురు, బరిసె, 2 చాకులు, ఇనుప వలలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. వీరిలో అనీల్ పరారీలో ఉన్నాడని తెలిపారు. మిగతా వారిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

మోపాల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచిప్ప కొండెం చెరువు ప్రాజెక్టు నుంచి కేబుల్ వైర్లు, ఇతర వస్తువులు దొంగిలించుకుపోతున్నారని గురువారం సంబంధిత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా పోలీసులు మంచిప్ప గ్రామానికి చెందిన శివరాం, శివాజీ, శంకర్, చెన్నూరి కుమార్, అశోక్, రాములు, ప్రకాష్, షేక్ అబ్దుల్ నబీలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సుష్మిత తెలిపారు. మంచిప్ప కొండెం చెరువు ప్రాంతంలో ఇరిగేషన్ శాఖ సబ్ స్టేషన్ నిర్మాణం పనులను లావ్రాన్ ప్రాజెక్టు, లక్ష్మి ట్రాన్స్‌మిషన్స్ కంపెనీ ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారన్నారు. వారికి సంబంధించిన కేబుల్ వైర్లు, ఇతర వస్తువులను దొంగిలించుకుపోతున్నారని ఫిర్యాదు చేశారని చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ముప్కాల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరు పట్టుబడ్డట్లు ఎస్సై కిరణ్ కుమార్ గురువారం తెలిపారు. ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గంగాధర్ రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు వెల్లడించారు.

ఇసుక లారీ స్వాధీనం

మోర్తాడ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై బి.రాము తెలిపారు. గురువారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు లారీని స్వాధీనం చేసుకొని, పోలీసు స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

కన్కల్‌లో ఇత్తడి బిందెలు..

తాడ్వాయి: మండలంలోని కన్కల్‌లో గురువారం ఇత్తడి బిందెలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. గ్రామంలో సర్పంచ్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఓటర్లను ప్రలోభపర్చడానికి వార్డు సభ్యుల ద్వారా మైలారం రవి సర్పంచ్ అభ్యర్థి పేరు పెట్టి ఇత్తడి బిందెలు పంచుతున్నారన్నారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి బిందెలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సర్పంచ్ అభ్యర్థి మైలారం రవిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

మద్యం పట్టివేత

భిక్కనూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఎఫ్ఎస్‌టీ బృందం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా జంగంపల్లి గ్రామానికి చెందిన మణికుమార్, జంగం లింగం ద్విచక్రవాహనంపై అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. తనిఖీల్లో ఎఫ్ఎస్‌టీ బృందం సభ్యులు, ఆర్ఐ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలోని అన్నారం గ్రామంలో ఎన్నికల అధికారులు గురువారం అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా పక్కా సమా చారం మేరకు ఎలాంటి అనుమతి లేకుండా మద్యాన్ని తీసుకువచ్చి ఇంట్లో ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి అక్రమంగా మద్యాన్ని సరఫరా చేసిన, రూ.50వేల కంటే ఎక్కువగా డబ్బులు వెంట తీసుకెళ్లిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● రామారెడ్డి మండలకేంద్రంలో ఓ సర్పంచ్ అభ్యర్థి వద్ద 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రామారెడ్డి ఎస్సై రాజశేఖర్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి పడిగెల శ్రీనివాస్ గుప్తా పంచాయతీ కోడ్ నిబంధనలు పాటించకుండా అక్రమంగా మద్యం తీసుకువచ్చి ఓటర్లకు పంచే ప్రయత్నం చేయగా గురువారం రాత్రి 8గంటలకు విషయం తెలుసుకుని వాటిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విధులకు ఆటంకం.. వ్యక్తి అరెస్టు

భిక్కనూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని మల్లుపల్లి గ్రామంలో నవంబరు 27న గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన యాకూబ్ ఎన్నికల విధుల్లో ఉన్న కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించడంతో పాటుగా దుర్భాషలాడుతూ దాడికి యత్నించాడని తెలిపారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదుచేయగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులకు, సిబ్బందికి ఆటంకం కలిగిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల విజయవంతానికి కృషిచేయాలన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముప్కాల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ బోటనీ, హిందీ పోస్టులకు (గంటల ప్రాతిపదికన) అర్హత గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. పీజీటీ బోటనీ పోస్టుకు పీజీలో 55 శాతం ఉత్తీర్ణతతో బీ.ఎడ్ కలిగి ఉండాలన్నారు. పీజీటీ హిందీ పోస్టుకు పండిత్ లేదా బీ.ఎడ్ తో పాటు టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 6వ తేదీ లోపు సంబంధిత కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

రెండవ రోజు నామినేషన్ల జోరు

ఆర్మూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. ఎన్నికల్లో భాగంగా తొలి రెండు విడతల్లో నామినేషన్ల ప్రక్రియ ముగిసిపోయిన విషయం తెలిసిందే. కాగా మూడోవిడతలోనూ నామినేషన్ల జోరు కొనసాగుతోంది. రిజర్వేషన్లు కలిసివచ్చిన చాలామంది బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం సర్పంచ్ స్థానాలకు 36 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో శివాజీ తెలిపారు. అదే విధంగా వార్డు స్థానాలకు 118 నామినేషన్‌లు దాఖలయ్యాయని వివరించారు.

ముప్కాల్: మండలంలో గురువారం నామినేషన్‌ల స్వీకరణలో సర్పంచ్ స్థానాలకు పది నామినేషన్‌లు దాఖలు కాగా, వార్డు స్థానాలకు 31 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు.

ఆలూర్: ఆలూర్ మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం సర్పంచ్ స్థానాలకు 13 నామినేషన్‌లు, వార్డు స్థానాలకు 90 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు.

వేల్పూర్: వేల్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో 2వ రోజు సర్పంచ్ స్థానాలకు 39 నామినేషన్‌లు దాఖలయ్యాయి. వార్డు స్థానాలకు 139 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండలంలో రెండవ రోజు పది గ్రామాల సర్పంచ్ స్థానాలకు 14 నామినేషన్‌లు, వార్డు సభ్యులకు అభ్యర్థులు 90 నామినేషన్‌లు వేసినట్లు ఎంపీడీవో తిరుమల తెలిపారు.

డొంకేశ్వర్: మండలంలో రెండవ రోజు నామినేషన్ కేంద్రాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. 13 సర్పంచ్ స్థానాలకు 21, 118 వార్డుల స్థానాలకు 76 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో లింగం తెలిపారు.



ఎన్నికలకు సంబంధించి మార్కెట్‌లో సిద్ధం చేసిన బ్యాడ్జీలు



నమూనా బ్యాలెట్‌పత్రం



ప్రచార సామగ్రి విక్రయిస్తామంటూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

పల్లె పోరు.. ప్రచార జోరు

జిల్లాలో సర్పంచ్ ఎన్నికల సామగ్రితో మార్కెట్లు సందడిగా మారాయి. జిల్లాకేంద్రంలోని పూసలగల్లిలోని ఫ్లెక్సీ షాప్‌లు, ప్రింటింగ్ ప్రెస్‌లు ఎన్నికల్లో పోటీచేస్తున్న వారితో రద్దీ పెరిగింది. ప్రచారానికి అవసరమైన క్యాప్‌లు, స్టిక్కర్లు, పోస్టర్లు, కరపత్రాలు, నమూనా బ్యాలెట్ పేపర్, కండువాలు, జెండాలు, గుర్తులు సిద్ధం చేశారు. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు. దాంతో ఎలక్షన్ కమిషన్ కేటాయించిన గుర్తులనే ముద్రించి అమ్మకానికి సిద్ధం ఉంచారు. మొదటి విడత పోలింగ్‌కి సంబంధించిన ప్రచారం మొదలుకావడంతో అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులకు సంబంధించిన నమూనా బ్యాలెట్ పేపర్లు, గుర్తులు, క్యాప్‌లు కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



గుర్తులతో కూడిన కండువాలు



నవీపేట మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ఎన్నికల సామగ్రి

మండలాలకు చేరుతున్న బ్యాలెట్ పేపర్లు

నవీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లు గురువారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ మేరకు ప్రత్యేకంగా తయారు చేసిన ట్రంక్ పెట్టెల్లో సంబంధిత బ్యాలెట్ పేపర్లు మండల పరిషత్ కార్యాలయానికి తరలించారు. బ్యాలెట్ పేపర్లను పంచాయతీలు, వార్డుల వారీగా వేరు చేసి తిరిగి వాటిని పోలీస్ స్టేషన్ తరలిస్తామని అధికారులు పేర్కొన్నారు.



ఎండిపోతున్న ప్లేట్లతో ఎండలో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

రోడ్డెక్కిన కేజీబీవీ విద్యార్థినులు

» తిన్న ప్లేట్లతో భీమ్‌గల్‌లో నిరసన » నీటి వసతి లేదని ఆవేదన

భీమ్‌గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీ విద్యార్థినులు గురువారం ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. నెల రోజుల నుంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి మునిసిపల్ ట్యాంకర్ ద్వారా నీటి తెప్పించినా సరిపోవడం లేదని, అరకొర నీటిని పైఅంతస్తులోకి మోసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారుఉ. విద్యాలయంలోని 250 మంది స్నానాలకి నీరు సరిపోవడం లేదని, నీరు లేక మూత్రశాలలు, మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని వాపోయారు. తిన్నప్లేట్లు కడిగేందుకు కూడా నీళ్ల లేవని వాటితోనే పాఠశాల ముందు ఎండలో బైఠాయించారు. ఎంఈవో స్వామి, ప్రత్యేకాధికారి అనురాధ పాఠశాలకు చేరుకొని సమస్య పరిష్కరిస్తామని చెప్పినా ఎండలోనే భీష్మించుకు కూర్చున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

» ఎన్నికల పనులు అప్రమత్తతతో నిర్వహించాలి

» నిజామాబాద్ కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

ఎడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ ఎన్నికల విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఇప్పటి వరకు పూర్తిచేసిన పనులు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా.. పోలింగ్ ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ ఎంపీడీఓ, తహసీల్దార్ ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. తప్పులకు తావు లేకుండా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. విధుల్లో పాల్గొనే అధికారులు, భద్రతా బలగాలతో కొనసాగుతున్న సర్వీస్ ఓటర్లు తమ హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, నిబంధనల ఉల్లంఘన ఎక్కడా జరగకూడదని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దత్తాత్రి, ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి తదితరులు ఉన్నారు.



ఎడపల్లి మండల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్



అదనపు కలెక్టర్ అంకిత్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

» నిజామాబాద్ అదనపు కలెక్టర్ అంకిత్

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ప్రతి విభాగాన్ని ఆయన పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఇన్‌చార్జి కమిషనర్ రవిబాబు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఫిర్యాదు..

మునిసిపల్ కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్ అంకిత్‌కు బీజేపీ నాయకులు పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. మునిసిపల్ పరిధిలో ఇంటి నెంబర్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, అనేక అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. దీంతో మునిసిపాలిటీ ఆదాయనికి గండిపడుతుందన్నారు. వెంటనే విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ జీవీ.నర్సింహారెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, ద్యాగ ఉదయ్, పొల్కం వేణు, సుంకరి రంగన్న, దొండి ప్రకాష్, కలిగోట ప్రశాంత్, ఉదయ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేసిన దృశ్యం

విద్యార్థులకు ప్లేట్ల వితరణ

సాలూర,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని సాలూర జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం భోజన ప్లేట్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ వేయడం, బొమ్మలకు రంగులు వేయడం లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. అంగవైకల్యాన్ని జయించిన స్టీఫెన్ హాకింగ్ జీవిత చరిత్రకు సంబంధించిన వీడియోలను విద్యార్థులకు చూయించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో రాజీ మంజూష మాట్లాడుతూ.. దివ్యాంగులను ప్రోత్సహిస్తే గొప్పగా రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ పద్మ, సీఆర్పీ స్వర్ణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

వేల్పూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి కోరారు. గురువారం వేల్పూర్ మండలం పడిగెల్, అంక్సాపూర్ గ్రామాలలో పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈయన వెంట ఎస్సై సంజీవ్, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, పోలీస్‌లు, తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

ఎన్నికల నియమావళిపై అవగాహన

నవీపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన జరిగే పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిపై గురువారం మండలంలోని మోకన్‌పల్లి, కమలాపూర్‌లలో పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కావడానికి అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి ప్రజలకు వివరించారు. పౌరులు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం స్థానికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు తిరుపతి, యాదగిరి గౌడ్ తదితరులున్నారు.

పాఠశాలకు డెస్క్‌బెంచీల అందజేత

జక్రాన్‌పల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత చిట్టాపూర్ దయానంద్ రెడ్డి జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డెస్క్ బెంచీలను గురువారం వితరణ చేశారు. సుమారు రూ.లక్ష 50 వేల విలువ గల 25 డెస్క్ బెంచీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దాత దయానంద్ రెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు బెంచీలు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, శ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, లింగన్న, శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



వితరణ చేసిన డెస్కు, బెంచీల్లో కూర్చున్న విద్యార్థులు

'ఆదర్శ' విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

ముప్కాల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఆంగ్లభాషా, ఒలంపియాడ్స్ టెస్టు, ఉపన్యాస పోటీలలో ఆదర్శ పాఠశాల మొదటి స్థానం కైవసం చేసుకుందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అంజలిన, మనస్విక, కప్స, రష్మితలు విజేతలుగా నిలిచారన్నారు. వీరు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన శ్రీనివాస్, రాజులను, విద్యార్థులను పాఠశాలలో అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్



రామన్నపేట్‌లో క్యూఆర్ కోడ్ పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వేధింపులకు పాల్పడితే చర్యలు

వేల్పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినుల పట్ల ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా, వేధించినా షీటీంకు సమాచారం ఇవ్వాలని షీటీం సబ్ డివిజన్ కానిస్టేబుళ్లు విఘ్నేష్, సుమతి సూచించారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గురువారం మండలంలోని రామన్నపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీం, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినులు ఈవ్‌టీజింగ్‌కు గురైతే షీటీం నెంబర్ 8712659795 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా షీటీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించారు. హెచ్‌ఎం శివాజీ, ఉపాధ్యాయుడు వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేషన్ తిరస్కరించారని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆర్మూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామ సర్పంచ్ పదవికి చింతల గోపి వేసిన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారని గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు ఫిర్యాదుచేశారు. చింతల గోపి ఆర్టీసీలో పనిచేస్తున్నారని ఇతర పార్టీకి చెందిన అభ్యర్థి ఫిర్యాదు చేశారన్నారు. గత కొంత కాలంగా విధులకు హాజరు కావడం లేదని అంతే తప్ప ఆయనపై ఎలాంటి కేసులు లేవని దినేష్ అన్నారు. తమ అభ్యర్థి ఎలిజిబుల్ కాదని చెప్పడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇలా ఉండగా తాము చింతల గోపి నామినేషన్‌ను తిరస్కరించలేదని వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ముప్కాల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి- గోవిందమాంబ కల్యాణ మహోత్సవాన్ని గురువారం ప్రవీణ్ పంతులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా ఎదుర్కోలు నిర్వహించి, కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్ర మాన్ని నిర్వహించారు. రాత్రికి భజన కార్య క్రమాలు కొనసాగాయి. భక్తుల అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం సభ్యులు, మండలంలోని భక్తులు, పలువురు పాల్గొన్నారు.

ఘనంగా దత్తజయంతి వేడుకలు

నవీపేట: మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయంలో గురువారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం మండప ఆరాధన, ఆవహిత దేవత పూజ, శ్రీ దత్త హోమం, శ్రీ దత్తు ఉయ్యాల, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగమయ్య గుట్ట ఆలయ వ్యవస్థాపకులు శ్రీ సిద్ధేశ్వర మహారాజ్ భక్తులకు ప్రవచనలు అందజేశారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు..

కమ్మర్‌పల్లి: మండలంలోని సాయిబాబా ఆలయంలో దత్తజయంతి, వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బాబా విగ్రహానికి పంచామృతాభిషేకం, యజ్ఞం తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించి పెద్దసంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలకు తరలివచ్చారు.



ముప్కాల్‌లో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



లింగమయ్య గుట్ట ఉత్సవాల్లో భక్తులు



ఉప్లూర్ సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ


ముగ్గురున్నా.. ముచ్చటగా బరిలో



డొంకేశ్వర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో ఎన్నో ఏళ్లుగా పోటీ చేయాలని ఆసక్తి ఉన్నప్పటికీ ముగ్గురు సంతానం ఉన్న వారు పోటీ చేసేందుకు అవకాశం లేక పోవడంతో చాలామంది ఎన్నికల పోరుకు దూరమయ్యారు. పార్టీలో సీనియర్ నేతలుగా ఉన్నప్పటికీ దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు పిల్లలు ఉన్న వారు కూడా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వడంతో పోటీ కి సై అంటున్నారు. పల్లెపోరులో యువకులు పోటీకి సిద్ధంకాగా వారిని సీనియర్ నాయకులు బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. డొంకేశ్వర్ మండలంలోని ఓ గ్రామంలో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేతతో సర్పంచ్, వార్డు మెంబర్ బరిలో ఉండేందుకు ఓ వ్యక్తికి ఈ నిబంధన కలిసి వచ్చింది. ముగ్గురు పిల్లలు ఉండి ఎన్నికల బరిలో నిలుస్తున్న చాలామంది ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆశ బారెడు.. ఆస్తి మూరెడు



భీమ్‌గల్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): చేతుల ఐదు పైసలు లేవు. సర్పంచ్ ఎలక్షన్‌లు రానే వచ్చె. పంట చేతికి వచ్చే సమ యంలో సెడగొట్ల వాన పడి పంట దిగుబడి తగ్గిం ది. ఉన్న కాస్త పంటను అమ్ముదామంటే కొనుగోలు కేంద్రాల్లో అధికారులు కొంటలే. ఎలచ్చన్లలో పోటీ చేద్దామంటే పైసలు కావాలి. దీంతో సర్పంచ్‌గా పోటీచేసేందుకు అభ్యర్థులు పైసల కోసం ఆసామీల దగ్గరికి లైన్ కడ్తుండ్రు. నూటికి రెండు, మూడు రూపాయల వడ్డీ అయినా సరే.. వడ్లు అమ్మగానే కట్టేస్తా కొప్పందం చేసుకుంటున్నరు. ఆఖ రుకు ఇంట్ల ఉన్న బంగారం అమ్మి పోటీ చేద్దామంటే ఇంట్లో పెండ్లాంతో లొల్లి.. ఆఖరికి ఉన్న ఎకరం అమ్ము దామంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులు తుట్టికి పావుశేరు అడుగుతుండ్రు. ఇగ నామినేషన్ వేసిన కొందరు మరీ ఇబ్బంది పడుతున్నరు. పోటీలో ఉన్నట్లు అందరికీ తెలిస్తే పైసలు పుట్టక ఎనక్కి తగ్గితే విలువ ఉండదని చుట్టుపక్కల వారి గోల. దీంతో రాత్రుల్లో నిద్ర పట్టడం లేదని పలువురు అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ఇలా ఉంది గామాల్లో పలువురు అభ్యర్థుల పరిస్థితి.

ఇస్తినమ్మ హామీ.. తప్పుకుంటినమ్మ పోటీ నుంచి

- ఒకేపార్టీ నుంచి ఎక్కువమంది అభ్యర్థులు
- పోటీ నుంచి తప్పించేందుకు నేతల హామీలు



భీమ్‌గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో భాగంగా మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. దీంతో ఆశావహులు తెరమీదికి రావడంతో ఆయా రాజకీయ పార్టీలకు అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారింది. ఒకే పార్టీ నుంచి ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు సర్పంచ్ పోటీకి రేసులో ఉండగా వారిని బుజ్జగించేందుకు నాయకులు రంగంలోకి దిగుతున్నారు. భీమ్‌గల్ మండలంలోని ఓ గ్రామంలో ఓ పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు సర్పంచ్ పదవికి పోటీలో ఉండగా మండల స్థాయి నాయకులు రంగంలోకి దిగి నచ్చ చెప్పేందుకు శతవిధాల ప్రయ త్నాలు కొనసాగిస్తున్నట్లు సమా చారం. సర్పంచ్ పోటీలో నిలు స్తున్న ఒకే పార్టీకి చెందిన ఇద్ద రు, ముగ్గురు నుంచి ఒకరిని బరిలో నిలిపి, తప్పుకున్న వారికి పార్టీలో మండల పోస్టు ఇస్తామని ఎర వేస్తున్నట్లు విశ్వసనీయ సమా చారం. ఈ ఒప్పందానికి కొంతమంది సాను కూలంగా స్పందిస్తుండగా, మరికొందరు ససేమీరా అంటున్నారు. దీంతో నేతలు తలలు పట్టుకుంటున్నారు.

ఓటేస్తే.. వైద్యం ఫ్రీ

ఎన్నికల సిత్రం

బాన్సువాడటౌన్ , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ బాన్సువాడకు చెందిన దంత వైద్యుడు డా. అచ్చుకట్ల జీవన్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 11 , 14 , 17న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేసి ఉచితంగా తమ వద్ద దంతవైద్య పరీక్షలు చేయించుకోవచ్చని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయడం బాధ్యతగా స్వీకరించాలన్నారు.

సీఐటీయూ జిల్లా కన్వీనర్‌గా ముదాం అరుణ్

కామారెడ్డి టౌన్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) జిల్లా కన్వీనర్‌గా ముదాం అరుణ్ నియామితులయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా మూడోమహాసభలో అరుణ్‌ని జిల్లా కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షునిగా విద్యార్థుల సమస్యలపై అనేకపోరాటాలు నిర్వహించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూశానని తెలిపారు. అదే స్ఫూర్తితో జిల్లాలో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్‌ల రద్దు కోసం, కార్మికులకు కనీసవేతనం అమలు కోసం పోరాటం నిర్వహిస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన సీఐటీయూ రాష్ట్ర నాయకులు రమ, సుధాకర్, జిల్లా నాయకుడు కే.చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జుక్కల్ మండలంలో 26 నామినేషన్లు



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జుక్కల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలో వివిధ గ్రామ పంచాయతీల్లో గత 2 రోజుల నుంచి 26 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవి కోసం నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్, వార్డుమెంబర్లుగా పోటీ చేసేవారు ఎన్నికల అధికారులకు నామినేషన్లు నింపి సమర్పించాలన్నారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భద్రత ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవతలపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లను అవహేళనగా మాట్లాడిన సీఎంకు, కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీఎం తన మాటలను వెనక్కి తీసుకుని, యావత్ హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిదుర సాయిలు, గుడుగుట్ల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల రాజు, పాశం భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

పీజీ సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, పీజీ కోర్సులలో మిగిలిన సీట్లను భర్తీ చేయాలని, అందుకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో పీజీ, ఎల్ఎల్‌బీ, ఇంటిగ్రేటెడ్, ఇతర కోర్సులలో సుమారు 200లకు పైగా మిగిలి ఉన్న సీట్లను వెంటనే భర్తీ చేయాన్నారు. ప్రతి సంవత్సరం వివిధ కోర్సులలో సీట్లు మిగిలిపోవడం, వాటిని విద్యార్థులకు కేటాయించకపోవడం దారుణమన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రైవేట్ కళాశాలలకు, ఇతర కళాశాలలకు అనుమతులు ఇచ్చిన తెలంగాణ యూనివర్సిటీలో మాత్రం ఎందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం లేదన్నారు. మిగిలిన సీట్లు భర్తీ చేసినట్లయితే యూనివర్సిటీకి ఆర్థికంగా సమకూరే అవకాశం ఉంటుందని అన్నారు. విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లలేనివారు, స్థానికులు ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని గతంలో ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిస్తే యూనివర్సిటీ ఉపకులపతికి అధికారం ఉంటుందని తెలిపారన్నారు. యూనివర్సిటీ అధికారులు మాత్రం ఖాళీ సీట్ల భర్తీ విషయంలో నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మిగిలిన సీట్ల కోసం అడ్మిషన్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ యూనియన్ నాయకులు నితిన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యయన కేంద్రం రీజినల్ కోఆర్డినేటర్ డా.రంజితలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ కోర్సుల్లో వివిధ సబ్జెక్టులలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు తప్పకుండా తరగతులకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇందూరు: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షలకు 4887 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4664 మంది విద్యార్థులు హాజరయ్యారని గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చక్రపాణి తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 299 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 271 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా ప్రవీణ్ బాధ్యతలు



ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ కుమార్

నాగిరెడ్డిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్‌కు ఫుల్ అడిషనల్ ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ గురువారం జిల్లా పరిషత్ సీఈవో చందర్ ఉత్తర్వులు జారీ చేశారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న లలిత కుమారిని గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యంగా వివరించడం పట్ల కలెక్టర్ సస్పెన్షన్ చేశారు. దీంతో కార్యాలయ సూపరింటెండెంట్‌కు ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రవీణ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ మద్నూర్ పట్టణ అధ్యక్షుడిగా గోపి



మద్నూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మద్నూర్ పట్టణ అధ్యక్షుడిగా బండి గోపిని నియమించినట్లు పార్టీ మండలాధ్యక్షుడు ధరాస్ సాయిలు తెలిపారు. మద్నూర్‌లో సీనియర్ నాయకుడిగా ఉన్న బండి గోపిని టౌన్ అధ్యక్షుడిగా నియమించాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు టౌన్ అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. యువతను రాబోయే ఎన్నికల్లో ముందుకు తీసుకెళ్లడానికి తనవంతు కృషిచేస్తానని పార్టీలో యువకులు చేరేలా కృషి చేస్తానని అన్నారు.

నగరంలో ఘంటసాల జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న గాయకులు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు ఘంటసాల 103వ జయంతిని పురస్కరించుకొని నగరంలో పాటలతో నివాళులర్పించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల పెన్షనర్ల భవన్‌లో సాంస్కృతిక కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి సభలో ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాడు ఘంటసాల ఆలపించిన మధుర గీతాలను గాయకులు ఆలపించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి శంకర్‌గౌడ్, అధ్యక్షుడు సిర్పలింగం, విజయమాల, చంద్రకళ, తుమ్మ శ్రీనివాస్, సాగర్, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అమరప్రసాద్

పిట్లం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని బిచ్కుంద ఏడీఏ అమర ప్రసాద్ అన్నారు. గురువారం పిట్లం రైతువేదికలో ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులతో మండల వ్యవసాయ శాఖ అధికారి వినోద్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు ఎరువులను కొనుగోలు చేసిన వెంటనే ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని సూచించారు. ప్రతి డీలర్ లైసెన్స్ కలిగి ఉండాలని, రైతులకు నాణ్యతతో కూడిన విత్తనాలను విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించరాదని సూచించారు. రైతులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అలాంటి నిర్వాహకులపై కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు డీలర్లు జొన్న విత్తనాలు అధిక ధరతో విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫర్టిలైజర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే బాధ్యత కవులదే

- ప్రముఖ కవి డా.సింగిశెట్టి శ్రీనివాస్



మాట్లాడుతున్న సినీ గేయ రచయిత వరికుప్పల యాదగిరి

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకునే బాధ్యత తెలంగాణ కవులదే అని ప్రముఖ కవి డా.సింగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం నగర శివారులోని ఓ విద్యాసంస్థలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనపురం దేవేందర్ అధ్యక్షతన "హరిదా సరస్వతీరాజ్ సాహిత్యోత్సవం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ తెలంగాణ కవులు, రచయితలు కాలువ మల్లయ్య, నాళేశ్వరం శంకర్, అన్నవరం దేవేందర్, కటుకోజ్వల రమేష్, సినీగేయ రచయిత వరికుప్పల యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కవులు కవితలు రాసేందుకు చాలా శ్రమిస్తున్నారని, భావావేశానికి లోనవుతూ తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. భావితరాల కోసం లక్ష పదాలతో తెలంగాణ పదకోశం (డిక్షనరీ) తీసుకురావాలని కవులు ఆకాంక్షించారు. సినీగేయ రచయిత వరికుప్పల యాదగిరి మాట్లాడుతూ.. సినిమాల్లో కూడా మంచి సాహిత్యం ఉంటుందన్నారు. అనంతరం కవులను, రచయితలను ఘనపురం దేవేందరన్ సన్మానించి జ్ఞాపికలు అందించారు. కవులు కాలువ మల్లయ్య, అన్నవరం దేవేందర్, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, నాళేశ్వరం శంకర్, కటుకోర్జ్వల రమేష్, పంచరెడ్డి లక్ష్మణ్, ఘనపురం దేవేందర్, నరాల సుధాకర్, తిరుమల శ్రీనివాస్, చమన్, అనిల్ ప్రసాద్, ఆచార్య శ్రీధర, డా.ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రోశయ్య వర్ధంతి



కామారెడ్డి కలెక్టరేట్‌లో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

కామారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌లు విక్టర్, మదన్‌మోహ న్ రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని అధికారులు పేర్కొన్నారు. డీఈవో రాజు, డీఎస్‌జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు చక్రదర్, సాయిరెడ్డి, సంతోష్, శివకుమార్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో కొనసాగుతున్న రైల్వే డబ్లింగ్ పనులు

నవీపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రైల్వేగేటు వద్ద డబ్లింగ్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. డబ్లింగ్ పనుల నిమిత్తం స్థానిక ప్రధాన రైల్వేగేటును బుధవారం ఉదయం 6 గంటల నుంచి మూసి ఉంచారు. సంబంధిత పనులు గురువారం రాత్రి వరకు పూర్తి చేసి శుక్రవారం ఉదయం నుంచి వాహనాలు యథావిధిగా నడిచే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అన్నదానాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ గోల్‌హనుమాన్ ఆలయంలో రాజ్‌జోషి భక్తులతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాదంలో భక్తులు ప్రసాదం స్వీకరించారు. బోర్గాం(పి) బ్యాంక్ కాలనీలో గల శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. భక్తులు వ్రతంలో భాగంగా గణపతి, గౌరీ, నవగ్రహ ఇంద్రాది అష్టదిక్పాలక దేవతలను పూజించి సత్యనారాయణ స్వామికి అష్టోత్తర పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మహాఅన్నప్రసాదంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి నారాయణశెట్టి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లెపూల నర్సింహాచారీ, శ్రీకాంత్ చౌదరి, శ్రీనివాస్, రాజయ్య, ఆలయ అర్చకులు హరీష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

బాన్సువాడటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్యకాలనీ దత్తమందిరం, పెద్ద హనుమాన్ మందిరం, శ్రీరామ దత్త మందిరం, అయ్యప్ప ఆలయంలో గురువారం భక్తులు దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం నుంచి దత్తాత్రేయునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులందరూ కలిసి ఊయల సేవ చేశారు. మధ్యాహ్నం భక్తుల కోసం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఉడుగుల సంజీవ్‌కుమార్, విజయలక్ష్మీ, శ్రీనివాస్, స్వాతి, నాగరాజ్, స్వప్న, శకుంతల, బెజుగం శంకర్, ఉమ, శ్రీరామ ఆలయ కమిటీ అధ్యక్షుడు రమాకాంత్‌రావు, శారద, మూర్తి, దేవికృష్ణప్రసాద్, సాయిబాబా, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి, సాయిప్రసాద్, ప్రశాంత్, తదితరలున్నారు.

బీర్కూర్: దత్త పౌర్ణమి సందర్భంగా గురువారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని దత్తాత్రేయ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో యజ్ఞయాగాది కార్యక్రమాలు నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే బీర్కూర్ తోట్ల హనుమాన్ ఆలయంలో దత్త జయంతి వేడుకలు జరిగాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దత్తాత్రేయుని ఊయల సేవ నిర్వహిస్తున్న దృశ్యం



తిమ్మాపూర్ దత్తాత్రేయ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అగ్నిప్రమాదంలో కాలిపోయిన టెంట్, బైక్ సీట్లు

గాంధారిలో అగ్నిప్రమాదం

గాంధారి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. మండలకేంద్రానికి చెందిన ఓ అభ్యర్థి సర్పంచ్ ఎన్నికల్లో పోటీచేస్తుండగా వారి ఇంటి ముందు వేయించిన టెంట్ అగ్నిప్రమాదంలో కాలిపోయింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మాజీ సర్పంచ్ సంజీవ్ భార్య ఈ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేస్తుంది. ఈ క్రమంలో తన ఇంటి ముందు కూర్చోవడానికి వీలుగా టెంట్ వేయించారు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి టెంట్ పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో పక్కనే ఉన్న మూడు ద్విచక్రవాహనాల సీట్లు సైతం కాలిపోయాయి. ఈ ప్రమాదం షార్ట్‌సర్క్యూట్‌లో అయ్యిందా లేక ఎవరైనా కావాలనే చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా అర్ధరాత్రి ఈ ప్రమాదం జరగడంతో ఎవరికి ఏమీ కాలేదని, పెద్దప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దోమకొండ నుంచి తరలివెళ్లిన

సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని తీసుకువస్తా..

- సమస్యలను ఉచితంగా పరిష్కరిస్తా
- సీరియల్ నెం.8లో స్పానర్ గుర్తుకు ఓటు వేయండి
- సర్పంచ్ అభ్యర్థి రాగుల దేవేందర్‌గౌడ్



రాగుల దేవేందర్‌గౌడ్, దోమకొండ సర్పంచ్ అభ్యర్థి

దోమకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దోమకొండ సర్పంచ్ అభ్యర్థిగా సీరియల్ నెంబర్ 8లో స్పానర్ గుర్తుకు ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని దోమకొండ సర్పంచ్ అభ్యర్థి రాగుల దేవెందర్‌గౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి లేకుండా ప్రజలకు ఏ అవసరం ఉన్నా పనులు చేస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఒక న్యాయవాదిగా, విద్యావేత్తగా చట్టాల మీద పూర్తిగా అవగాహన ఉన్న వ్యక్తిగా గ్రామ పంచాయతీ, మిగతా అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రజలకు వచ్చిన సమస్యలను ఉచితంగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. దోమకొండలో డిగ్రీ కళాశాలను సాధించేందుకు ప్రభుత్వం మెడలు వంచి మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్ల సంఖ్యను పెంచి అన్ని రోగాలకు దోమకొండలోనే ఉచిత వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. దోమకొండ నుంచి తరలివెళ్లిన సబ్‌ట్రెజరీ, ఇతర ప్రభుత్వ సబ్‌డివిజనల్ కార్యాలయాలను తీసుకురావడానికి ముందుంటానన్నారు. 108 అంబులెన్స్ సేవలు పునరుద్ధరించడానికి, బీడీకార్మిక అసుపత్రి ఏర్పాటు కోసం కృషి చేస్తానన్నారు. రూ.1కే ఫిల్టర్ వాటర్ అందిస్తానన్నారు. ప్రతీ వీధిలో మురికి కాలువలు, వీధి లైట్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేస్తానని అన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు

కామారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామంలో గురువారం ఇద్దరు బడిబయట పిల్లలను ఉపాధ్యాయుడు కృష్ణారావు, సీఆర్‌పీ చిరంజీవిల ఆధ్వర్యంలో గుర్తించారు. మండలంలోని చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి వరకు చదువుకున్న పరశబోయిన అభిలాష్, ధర్మగోని బన్నీ అనే ఇద్దరు విద్యార్థులు 10వ తరగతి చదవకుండా బడి మానేశారని వారు తెలిపారు. అయితే వీరిని గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. బడి ఎందుకు మానేశారని విద్యార్థులను ప్రశ్నించగా పరశబోయిన అభిలాష్ అనే విద్యార్థి తన తండ్రి చనిపోయాడని, మరో విద్యార్థి ధర్మగోని బన్నీ కాళ్లకు పుండ్లు అయ్యాయని బడి మానేసినట్లు పేర్కొన్నారు. దీంతో వీరిద్దరితో ఓపెన్ ఎస్సెస్సీ కట్టించినట్లు వారు తెలిపారు.

జీపీలలో విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

లింగంపేట, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక కోసం సింగిల్ నామినేషన్లు వచ్చిన గ్రామ పంచాయతీలలో గురువారం తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో నరేష్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో విచారణ జరిపారు. గ్రామస్థులను భయపెట్టికాని, ప్రలోభాలకు గురిచేసి కాని ఏకగ్రీవం చేసుకున్నారా, గ్రామస్తులు ఐక్యంగా నిర్ణయం తీసుకున్నారా? అనే విషయాలను గ్రామంలో విచారణ జరిపారు. మాలోత్‌సంగ్యానాయక్‌తండా, సజ్జన్‌పల్లి, మాలోత్‌తండా, అయ్యపల్లితండాలలో విచారణ చేసినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరగలేదని గ్రామస్తులు తెలియజేసినట్లు ఎంఈడీవో తెలిపారు.

గాంధారిలో...



విచారణ చేస్తున్న అధికారులు

గాంధారి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తండా, గ్రామాల్లో అధికారులు గురువారం విచారణ చేపట్టారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా గాంధారి మండలంలో సర్పంచ్, వార్డుస్థానాలకు సంబంధించి ఒకే నామినేషన్ దాఖలైన పిస్కిల్‌గుట్ట, తిప్పారం తండా, చిన్నాపూర్, హేమ్లానాయక్ తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రుణుకా చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్ మాట్లాడుతూ విచారణ చేసి నివేదికలు తయారు చేశామని, వీటిని ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు, ఆర్ ప్రదీప్ పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి



రాజంపేటలో మాట్లాడుతున్న యువకులు

రాజంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించిన వారికి ఓటు వేస్తామని రాజంపేట మాదిగ సంఘం సభ్యులు తెలిపారు. రాజంపేట గ్రామంలో కొన్ని రోజులుగా తమ మాదిగ కులస్థులను దూరంగా పెడుతూ గ్రామంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఎవరో ఒకరు చేసిన తప్పులకు తమను దూరం పెట్టడం ఎంతవరకు న్యాయమని గ్రామస్తులను ప్రశ్నించారు. మాదిగలను ఏ కార్యక్రమానికి రానియకుండా, ఊళ్లోడప్పు మోగకుండా అడ్డుకుంటున్నారని వాపోతున్నారు.

ఆలయ వార్షికోత్సవాల్లో మాజీ ఎమ్మెల్సీ



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి

సిరికొండ,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) సర్పెల్లి తండాలో కొలువు దీరిన దుర్గాభవానీ మాతా ఐదో వార్షికోత్సవానికి మాజీ ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అరికెల నర్సారెడ్డి హాజరయ్యారు. గురువారం ఆలయంలో దీక్షాగురు ప్రేమ్‌సింగ్ మహరాజ్‌తో కలిసి నర్సారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వసంత చందర్, నరేష్, గంగారెడ్డి, నర్సయ్య, నవీన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



వెంకటేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడ్వాయి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ శబరిమాత ఆశ్రమంలో ఘనంగా వెంకటేశ్వర కల్యాణం నిర్వహించారు. గురుపౌర్ణమి దత్త జయంతి సందర్భంగా శ్రీ శబరిమాత 55వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆశ్రమంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడురోజులపాటు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారన్నారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆశ్రమాన్ని సందర్శించిన పలువురు నేతలు శుక్రవారం శబరిమాత ఆశ్రమాన్ని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట్‌రమణ రెడ్డి, అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యు లు పైడి ఎల్లారెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వచ్చిన నాయకులకు ఆశ్రమ ట్రస్టు తరపున శాలువాతో సన్మానించారు.

గ్రామాల్లో త్రిముఖ పోరు

(5వ పేజీ తరువాయి)

సర్పంచులను గెలిపించుకోవడం తద్వారా భవిష్యత్‌లో రానున్న ఎన్నికల్లో సత్తా చాటాలని కారు నేతలు భావిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు పూర్తి స్థాయిలో రంగంలోకి దిగారు. పంచాయతీల్లో పార్టీ మారని అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. పంచాయతీల్లో పూర్వ వైభవం కోసం ఈ ఎన్నికలను మంచి అవకాశంగా భావిస్తున్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ .. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు సూచిస్తున్నారు.

కమల వికాసం కోసం

గత ఎన్నికల్లో ఎప్పుడూ చూడని విధంగా ఈ సారి బీజేపీ స్థానిక ఎన్నికల పై ఫోకస్ చేసింది. రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే కింది స్థాయి నుంచి బలంగా ఉండాలనే ఆలోచనతో ముందుకు సాగుతుంది. ఈ నేపథ్యంలో అన్ని గ్రామ పంచాయతీలు, వార్డుల్లో అభ్యర్థులను బరిలో నిలుపుతున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు దీటుగా బీజేపీ తన కేడర్‌ను సమాయత్తం చేస్తుంది. యువతలో బీజేపీకి ఉన్న క్రేజీతో పాటు అన్ని వర్గాలను కలుపుకెళ్లి అధిక సంఖ్యలో సర్పంచ్‌లను గెలిపించుకోవాలని ఉవ్విళ్లూరుతుంది. విడతల వారీగా గ్రామాల్లో ముఖ్యనేతల ఆధ్వర్యంలో సర్పంచ్, వార్డు అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. కేంద్ర పథకాలను ఇంటింటికి ప్రచారం చేసేందుకు సిద్ధం అయ్యారు. పల్లెలకు వచ్చే నిధులన్నీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చేవే అని చెప్పే ప్రయత్నంలో మునిగి తేలుతున్నారు.

చిత్తడి నేలలను గుర్తించాలి

(5వ పేజీ తరువాయి)

పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లను, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రిని పరిశీలించారు. మొదటి విడతలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పది మండలాలకు బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పంపిణీ, భద్రపరిచే విధానాన్ని పరిశీలించారు. మండలాలకు చేరుకున్న బ్యాలెట్ పేపర్లను సంబంధిత ఎంపీడీవోలు స్ట్రాంగ్ రూమ్‌లో కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య భద్రపర్చాలని అధికారులు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపలు లేకుండా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో చందర్‌నాయక్, ఎస్‌టీవో వెంకటేశ్వర్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను అమలు చేయాలి

(5వ పేజీ తరువాయి)

సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. నివేదికలు, టి - పోల్ ఎంట్రీలు, రికార్డులు, మిస్ మ్యాచ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రి య పూర్తి చేయడం జరిగిందని, స్టేజ్ 2 ఆర్.ఓ.ల కోస ం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించ డం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సర్పంచ్ స్థానాల ఎన్నిక మొదటి విడతలో 11 స్థానాలు ఏకగ్రీవం కాగా 156 స్థానాల్లో పోలింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మదన్‌మోహన్, పంచాయతీ అధికారి మురళీ, ఆర్డీవో వీణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చందర్, సం బంధిత అధికారులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



ధర్పల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ధర్పల్లి/సిరికొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఒన్నాజిపేట్, ధర్పల్లి, సిరికొండ, కొండాపూర్ పోలింగ్ కేంద్రాలను ఆయన సీఐ బిక్షపతి, ఎస్‌హెచ్‌వో ఎం.కళ్యాణితో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. వివిధ గ్రామాలను సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సెన్సిటీవ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులను బైండోవర్ చేశామని వెల్లడించారు. పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి వాహనాల తనిఖీని క్షుణ్ణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఆదేశించారు. పోలింగ్‌కేంద్రాల వద్ద విద్యుత్, మౌలిక సదుపాయాలపై అడిగితెలుసుకున్నారు. ఎన్నికల కోసం పోలీసుశాఖ తరపున అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలి

● తహసీల్దార్ సత్యనారాయణ



అభ్యర్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్

సదాశివనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీచేసే సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులు ఎన్నికల నియమావళిని అనుసరించాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. 2025 స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డుస్థానాలకు పోటీచేస్తున్న అభ్యర్థులకు విధివిధానాలపై ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50 లక్షలకు మించి ఖర్చు చేయరాదని, అభ్యర్థి వద్ద రూ.10వేలకు మించి ఉండరాదన్నారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలనుకుంటే ముందస్తుగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఒకరోజు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఇస్తామన్నారు. అభ్యర్థులు తమ జీరో అకౌంట్ ద్వారానే లావాదేవీలను జరపాలని, రోజువారీ ఖర్చు విధిగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎస్సై పుష్పరాజ్ పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసే వారికే మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

నిజామాబాద్ సిటీ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నికలలో ప్రజల తరపున పోరాడుతూ, ప్రజా సేవచేస్తున్న అభ్యర్థులకు సీపీఐ మద్దతు ఇస్తుందని పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బోధన్, నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్లలో సీపీఐ, ఇతర కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులతో పాటు గడిచిన ఏడు సం వత్సరాల కాలంలో ప్రజాసేవకే పరిమితమై పనిచేసిన అభ్యర్థులకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం జరిగే ఈ ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి భవిష్యత్తు కాలంలో సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధి కోసం పని చేసే వారిని ఎన్నుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.ఓమయ్య, పి.రంజిత్, ఆనంద్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలి



ఆశలతో మాట్లాడుతున్న వైద్యురాలు దివ్య

భిక్కనూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు చేయించుకునేలా చూడాలని, ఇళ్లల్లో పరిసరాల శుభ్రతపై ఆశలు అవగాహన కల్పించాలని వైద్యురాలు దివ్య అన్నా రు. గురువారం భిక్కనూరు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించి పలు అంశాలపై ఆశలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ హెచ్‌ఐవీ రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఆశలు ఇంటింటికి వెళ్లి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటరమణ, వైద్యసిబ్బంది, ఆశాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పోలింగ్‌స్టేషన్ల పరిశీలన



పోలింగ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్

దోమకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోమకొండ, లింగుపల్లి గ్రామాల్లోని పోలింగ్‌స్టేషన్‌లను గురువారం రాష్ట్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. మౌలికవసతులు, ఓటింగ్ చేయు విధానం, ఇతర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్సై ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

డీజీపీ శివధర్‌రెడ్డిని కలిసిన కలెక్టర్



డీజీపీకి మొక్కను అందజేస్తున్న కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్

కామారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాట్లపై, పోలీసు భద్రతపై రాష్ట్ర డీజీపీ బి.శివధర్‌రెడ్డి గురువారం కామారెడ్డికి వచ్చారు. ఇందులో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై పోలీసు అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎన్నికల ఏర్పాట్ల పై కలెక్టర్ డీజీపీ వివరించారు.



ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి అండెం శంకర్‌రెడ్డి

నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తా..

- ఫుట్‌బాల్ గుర్తును చూపుతూ ఇంటింటా ప్రచారం
- దోమకొండ సర్పంచ్ అభ్యర్థి అండెం శంకర్‌రెడ్డి

దోమకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దోమకొండ సర్పంచ్‌గా తనను గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి అండెం శంకర్‌రెడ్డి గురువారం దోమకొండలో కాంగ్రెస్ నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సహకారంతో దోమకొండలో సర్పంచ్‌గా పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సీరియల్ నెంబర్ 4, ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి తనను సర్పంచ్‌గా గెలిపిస్తే ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా దోమకొండ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దోమకొండను జిల్లాలో మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతానని అన్నారు. గ్రామంలో పరిశుభ్రత, ప్రతీ ఇంటికి నీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, స్వచ్ఛ గ్రామంగా తయారు చేయాడానికి కృషి చేస్తానన్నారు. ప్రజలు తమ ఓటును ఫుట్‌బాల్ గుర్తుపై వేసి భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడికి సన్మానం



శ్రీధర్‌గుప్తాను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సిద్ధిశ్రీధర్ గుప్తాను గురువారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ప్రజాసేవలో ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం సభ్యులు, నాయకులు రాచకొండ రవీందర్, హరిబాబు, స్వామి, ఆదిమూలం సతీష్ కుమార్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆనంద్

బాన్సువాడ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మూడోవిడత నామినేషన్ ప్రక్రియలో భాగంగా బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో నామినేషన్ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలను తప్పొప్పులు లేకుండా పూర్తిచేసి సమర్పించాలని, నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపరిండెంట్ ముజాహిద్, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, ఆర్వో, ఏఆర్వో తదితరులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి



దివ్యాంగులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సదాశివనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మనోధైర్యం ఉంటే అంగవైకల్యం అడ్డుకాదని సదాశివనగర్ మండల విద్యాధికారి యాసుఫ్ అన్నారు. గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యావనరుల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే అన్నింట్లో విజయం సాధించవచ్చునని అన్నారు. దివ్యాంగులకు నిర్వహించిన ఆటపోటీలే ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం దివ్యాంగులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొదటి విడత ప్రచారం షురూ

(5వ పేజీ తరువాయి)

బరిలో నిలిచారు. మొదటివిడత ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరనేది తేలింది. ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించిన అభ్యర్థులు ఇక ప్రచారంలో స్పీడు పెంచనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఓటర్లను ఎలాగైనా తమ వైపు తిప్పుకునేలా ప్రణాళికలు అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఓటర్ల లెక్కలు తీసే పనిలో అభ్యర్థులు వారి అనుచరులు నిమగ్నమయ్యారు. అనుకూలంగా ఉండేవారు వ్యతిరేకులు, తటస్థంగా ఉండే వారెవరో లెక్కలు తీస్తున్నారు. అంతేకాకుండా గ్రామ అభివృద్ధికి తాము ఏం చేయాలనుకున్నామో రూపొందించిన మేనిఫేస్టోలను ఓటర్లకు వివరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, బ్యానర్లతో, సోషల్ మీడియా ద్వారా సొంత మేనిఫేస్టోలు ప్రకటిస్తూ ప్రచారం చేపడుతున్నారు. దీంతో పల్లెల్లో ఎన్నికల ప్రచార సందడి నెలకొంటోంది.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- ఆంధ్రాకింగ్ తాలూకా
ప్రియ 35- రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి అఖండ 2
వెంకటేశ్వర కలివివనం

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230